


# సత్యవాక్యము

# The Word of Truth

## క్రైస్తవ మాసపత్రిక

NOVEMBER - 2010

సంవత్సర చందా రూ. 50/=

# సంక్షిప్త వార్తలు

2010 అక్టోబరు 20 నుండి 23 వరకు అమెరికాలోని **World Evangelism** టీమ్ దరపున లూయిస్ రష్మోర్, ఆయన సతీమణి బోనీ రష్మోర్ మరియు థెర్మన్ హాడ్జ్ గార్లు కాకినాడ సత్యవాణి క్రీస్తుసంఘమును దర్శించిరి. 21వ తేదీ గురువారం రామచంద్రపురం కుమ్మరవీధిలోని క్రీస్తు సంఘ వార్షికోత్సవములో పాల్గొనిరి. అక్కడ సంఘమును వాక్యరీతిగా ప్రోత్సహించిరి. వారు తమ బిల్డింగ్‌ను విశాలపరచు చున్నందున అభినందించిరి. 24వ తేదీ శనివారం విశాఖపట్టణం మీదుగా బర్మాదేశమునకు పయనమైరి. కుమ్మర వీధిలోను, రామచంద్రపురం పరిసరప్రాంతములలోను సోదరులు ఎన్. ప్రసాద్ గారు క్రీస్తుకొరకు మంచిపనిచేయుచున్నారు.

2010 అక్టోబరు 24 నుండి 26 వరకు (ఆదివారం నుండి బుధవారం వరకు) కాకినాడ సత్యవాణి క్రీస్తుసంఘా వరణములో గొప్ప బైబిలు లెక్చరర్‌షిప్ జరిగెను. ఆ లెక్చరర్‌షిప్‌లో ఆత్మీయసంబంధమైన గొప్ప ప్రసంగములు, పాటలు విన్పించబడెను. మూడువేలకు పైగా సోదరసోదరీలు ఆ నాలుగు దినములలోను హాజరైరి. చిట్టివలస నుండి వచ్చిన సోదరులు మజ్జి కృపారావు గారు తాను రచించిన పాటలను విన్పిస్తు, నేర్పిస్తు సభికులను ఆత్మీయానంద పరవశులను జేసిరి. సోదరులు జిమ్ కెల్లీ, ఆర్.సి.హెచ్. సద్గుణరావ్, డి.చిరంజీవి, వి.సుదర్శనరావ్, మజ్జి కృపారావు గార్లు తదితర్లు చక్కటి ప్రసంగములను చేసిరి. జిమ్ కెల్లీ గారొక్కరే పదికిపైగా శక్తివంతమైన బైబిలు పాఠములను బోధించిరి. ఆయన ఉపన్యాసములన్నీ సోదరులు ఆర్.సి.హెచ్. సద్గుణరావ్ గారు తెలుగులో అనువదించిరి. ఆయన కూడా చక్కటిపాటలు పాడుచు, తద్వారా ఉపదేశించుచు సభికులను ముగ్ధులనుజేసిరి. ప్రతిరోజు మధ్యాహ్నం జిమ్‌కెల్లీ గారి సతీమణి ఎలైన్ గారు స్త్రీలకు ప్రత్యేక తరగతులు నిర్వహించగా సోదరి సువార్త గారు ఆమె ఆంగ్లపాఠములను తెలుగులో అనువదించిరి. ఎలైన్ కెల్లీగారి వాక్యసందేశములను విని వందలాది స్త్రీలు ఆత్మీయముగా బలపడిరి. ఆసోదరి ప్రతిసంవత్సరము కాకినాడ రావలెనని భారతీయ సోదరీలు, సహోదరులు ఆమెను కోరిరి.

లెక్చరర్‌షిప్ అంతటిని సోదరులు రిక్కీగూటం గారు సమర్ధవంతముగా నడిపించిరి. 25వ తేదీ సోమవారం ఉదయం రిక్కీగారు నడుపుచున్న సత్యవాణి

సత్యవాక్కు
THE WORD OF TRUTH
P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
Joshua Gootam

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 31 నవంబరు - 2010 సంచిక - 4

# ఎవరెవరి కొరకు, దేనికొరకు మనము ప్రార్థించాలి ?
## (For Whom and For What Should We Pray ?)

ప్రార్థనను గూర్చి గత రెండు మాసములలోను మనం కొంత తెలిసికొన్నాము. మనం ఎప్పుడెప్పుడు ప్రార్థించాలో తెలిసి కొన్నాము. సరిగదా ప్రార్థన జీవితాన్ని గడిపిన వారి కొన్ని సందర్భాలను గత పాఠంలో గమనించాము. ఈ రోజు మనం ప్రార్థించునప్పుడు ఎవరెవరి కొరకు ప్రార్థించాలి? దేని కొరకు మనం ప్రార్థించాలి ? అనే అంశాలను కొంత మట్టుకు ధ్యానించుదాం.

నిజానికి మనం మనుష్యులందరి కొరకును ప్రార్థించాలి. అందరును సత్యము విషయమైన అనుభవ జ్ఞానము కలిగి, క్రీస్తునందు విశ్వసించి అందరు క్రీస్తు సువార్తకు లోబడాలని మనం ప్రార్థించాలి. అపో. పౌలు ఇశ్రాయేలీయుడే. అందువలన "సహోదరులారా, ఇశ్రాయేలీయులు రక్షణ పొందవలెనని నా హృదయాభిలాషయు, వారి విషయమై నేను దేవునికి చేయు ప్రార్థనయునై యున్నవి" యని రోమా 10:1లో వ్రాసాడు. మనమును అట్లే ప్రార్థించాలి. అందువలన మనము మనుష్యులందరి కొరకు ప్రార్థించాలని అతడు 1 తిమోతి 2:1లో వ్రాసాడు.

తరువాత మనం మనలను పాలించు నాయకుల కొరకు, అధికారుల కొరకు ప్రార్థించాలి. పౌలు ఇట్లు చెప్పాడు: "రాజుల కొరకును, అధికారులందరి కొరకును విజ్ఞాపనములును, ప్రార్థనలును,

యాచనలును, కృతజ్ఞతాస్తుతులును చేయవలెనని హెచ్చరించుచున్నాను. ఇది మంచిదియు, మన రక్షకుడగు దేవుని దృష్టికి అనుకూలమైనదియునై యున్నది. ఆయన మనుష్యులందరు రక్షణపొంది సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు" (1తిమో 2:2-4). నిజానికి పౌలు ఈ మాటలు వ్రాయుసరికి అనాటి క్రైస్తవులు ప్రభుత్వము వలన ఘోరముగ హింసింపబడు చుండిరి. అయినను వారికొరకు ప్రార్థించాలని అతడు హెచ్చరించాడు. మనలను పాలించు వారి వ్యక్తిత్వము ఎట్లున్నను వారు సక్రమముగా మన దేశాన్ని పాలించ గల్గునట్లును, వారికి తగిన జ్ఞాన వివేకములు దేవుడు ప్రసాదించు నట్లును, వారు కూడ రక్షణ పొందగల్గునట్లును మనము ప్రార్థించాలి మరి ముఖ్యముగ మన పాలకులు గైకొను నిర్ణయాలను బట్టి సువార్త వ్యాప్తికి క్రీస్తు సంఘమునకు యేమి ఆటంకము కలుగ కుండునట్లు మనం ప్రార్థించాలి.

మన సహోదరుల కొరకు మనం ప్రార్థించ బాధ్యులమై యున్నాము. మీరు ఒకని కొరకు ఒకడు ప్రార్థన చేయుడి యని యాకోబు వ్రాసాడు (యాకోబు 5:16). "మీరు శ్రేష్టమైన కార్యములను వివేచింప గల వారగుటకు మీ ప్రేమ తెలివితోను సకల విధములైన అనుభవ జ్ఞానముతోను కూడినదై అంతకంతకు అభివృద్ధి పొందవలెననియు, ఇందువలన దేవునికి మహిమయు స్తోత్రమును కలుగునట్లు మీరు యేసు క్రీస్తు వలనను నీతి ఫలములతో నిండుకొనిన వారై క్రీస్తు దినమునకు నిష్కపటులును నిర్దోషులును కావలెననియు ప్రార్థించుచున్నానని" అపో.పౌలు ఫిలిప్పయిలోని క్రైస్తవులకు తెలియజేసాడు (ఫిలిప్పీ 1:9-11). మన సహోదరులను గూర్చి ప్రార్థించకపోతే వారికి విరోధముగా పాపము చేసిన వారమవుదుము (1 కొరింథీ 8:12).

తరువాత మనం క్రీస్తు యొక్క సత్యసువార్తికుల కొరకు ప్రార్థించాలి. అపో.పౌలు పరిశుద్ధాత్మ ప్రేరణ గలవాడే అయినను. "ప్రభువు వాక్యము శీఘ్రముగ వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తమును, మేము మూర్ఖులైన దుష్ట మనుష్యుల చేతిలో నుండి తప్పింపబడు నిమిత్తమును మా కొరకు ప్రార్థించుడి . ఆత్మవలన ప్రతి సమయమందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుచు మెలకువగా ఉండుడి. మరియు నేను దేని నిమిత్తము రాయబారినై సంకెళ్లలో యున్నానో, ఆ సువార్త మర్మమును ధైర్యముగా

తెలియజేయుటకు నేను మాటలాడ నోరు తెరచునప్పుడు దానిని గూర్చి నేను మాటలాడ వలసినట్లు నా నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపనచేయుచు మెలకువగా ఉండుడి' (ఎఫెసీ 6:18,19). ఈ మాటలు వ్రాయుసరికి అతడు రోమా చెరసాలలో బందీయై యున్నాడు. అయినను సత్యవాక్యమును సరిగ ప్రకటించు శక్తి కొరకు మనం తప్పక ప్రార్థించాలి.

రోగుల కొరకును శ్రమలలో యున్నవారి కొరకును మనం ప్రార్థించాలి. "మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా? అతడు ప్రార్థన చేయ వలెను.... మీలో ఎవడైనను రోగియై యున్నాడా? అతడు సంఘపు పెద్దలను పిలిపించవలెను. విశ్వాస సహితమైన ప్రార్థన ఆ రోగిని స్వస్థపరచును' అని యాకోబు వ్రాసాడు (యాకోబు 5:13-15). అద్భుత రీతిగా దేవుడు ఆ రోగిని స్వస్థపరుస్తాడని కాదుగాని, రోగియైన వాడు స్వస్థత పొందుటలో ప్రభువు యొక్క సహాయం కొరకు మనం తప్పక ప్రార్థించాలి. మెలేతు అను ద్వీపములో పొప్లి అనువాని యొక్క తండ్రి జ్వరము చేతను, రక్తభేరి చేతను బాధ పడుచు పండుకొని యుండెను. పౌలు అతని యొద్దకు వెళ్లి ప్రార్థన చేసి అతని మీద చేతులుంచి స్వస్థపరచెను (అపొ.కా. 28:7,8). దావీదు యొక్క బిడ్డ జబ్బు పడగా అతడు ఉపవాసముండి దేవుని ప్రార్థించాడు (2 సమూయేలు 12:16,17).

పాపములో పడి నశించి పోవుచున్న వారి కొరకు మనము ప్రార్థించాలి. నశించిన దానిని వెదకి రక్షించుటకు యేసు ప్రభువు ఈ లోకమునకు వచ్చారు. పాపములో జీవించు చున్నవారు క్రీస్తు సువార్తకు లోబడి రక్షింబడగల్గునట్లు మనము తప్పక ప్రార్థించాలి. ఆయనను సిలువవేసిన వారిని చూచి యేసు, "తండ్రీ వీరేమి చేయు చున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని'' ప్రార్థించెను (లూకా 23:34). పెంతెకొస్తునాడు ఇంచుమించు మూడువేలమంది సువార్తను విని పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది రక్షింవబడగా ఆయన ప్రార్థన నెరవేరెను(అపొ.కా. 2:36-47).

మన శత్రువుల కొరకును మనం ప్రార్థించాలి, "మీశత్రువులను ప్రేమించుడి, మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి" యని యేసు ప్రభువు బోధించారు (మత్తయి 5:44). "నీ శత్రువు ఆకలి గొని యుంటే అతనికి భోజనము పెట్టుము. దప్పిగొని యుంటే దాహమిమ్ము; ఆలాగు చేయుటవలన అతని తల మీద నిప్పులు కుప్పగా పోయుదువు. కీడువలన జయింప బడక మేలు చేత కీడును జయించుమని" దేవుని వాక్యము బోధించుచున్నది.

మనం దేని కొరకు ప్రార్ధన చేయాలి? జ్ఞానము కొరకు ప్రార్థించాలి. "మీలో ఎవని కైనను జ్ఞానము కొదువుగా ఉన్న యెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్రహింపబడును" (యాకోబు 1:5). శోధనలో ప్రవేశించకుండునట్లును, శోధనను జయించగల్గుటకు శక్తి కొరకును మనము ప్రార్థించాలి (మత్త 26:41). సహోదరుల ఐక్యత కొరకు ప్రార్థించాలి. విశ్వాసులందరు ఏకమై యుండాలని యేసు ప్రభువు ప్రార్థించారు (యోహాను 17:20,21).

భౌతిక సంబంధమైన ఆరోగ్యము కొరకు ఆశీర్వాదముల కొరకు మనము ప్రార్థించాలి (మత్తయి 6:11). క్షమాపణ కొరకు మనం ప్రార్థించాలి (మత్త 6:12). ఈ లోకంలో శాంతి సమాధానముల నెలకొల్పబడి యుండునట్లు మనము ప్రార్థించాలి (1 తిమో 2:1-2). మరీ ముఖ్యముగా దేవుని పని చేయు పనివారి కొరకు ప్రార్థించాలి. "కోత విస్తారమే గాని పనివారు కొద్దిగా యున్నారు, గనుక తన కోతకు పనివారిని పంపుమని కోత యజమానుని వేడుకొనుడని" యేసు తన శిష్యులతో చెప్పెను (మత్త 9:37,38).

"నీతి మంతుని ప్రార్థన బహుబలము గలదై యుండును" (యాకో 5:16). నీవు క్రీస్తు నందు విశ్వసించి, మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము, ప్రభువు నిన్ను నీతి మంతునిగా తీర్చ తన సంఘముతో చేర్చుకొనును.

క్రైస్తవరుజువులు:

## ఈ యేసు ఎవరు?

## (Who is this Jesus?)

ఇప్పటి వరకు యూదుల యొక్కయు, రోమీయుల యొక్కయు చరిత్రకారుల వ్రాతలను గమనించాము. ఆదిమ క్రైస్తవ హత సాక్షులు వ్రాసిన వ్రాతలను గమనించాము. ఆదిమ క్రైస్తవ హత సాక్షులు వ్రాసిన వ్రాతలను చదివాము. పురాతత్వ శాస్త్రము నుండి, ప్రవచనములనుండి రుజువులను సేకరించాము. ప్రత్యక్ష సాక్షుల సాక్ష్యమును కూడ గమనించాము. ఈ రుజువులన్నిటిని బట్టి క్రొత్త నిబంధన నమ్మదగిన చారిత్రాత్మక పత్రమని మనము నమ్మవచ్చును. యేసుక్రీస్తు జీవించారు. ప్రేమించారు. బోధించారు. పరిచర్య చేసారు, చనిపోయారు, మూడవ దినమున తిరిగిలేచారు. మొదటి శతాబ్దపు ఆరంభములోనే ఈ సంగతు లన్నియు నెరవేరెను.

రెండువేల సంవత్సరముల క్రితము బెత్లేహేము చిన్నగ్రామములో ఒక శిశువుజన్మించి పశువుల తొట్టిలో

పరుండబెట్టబడెను. ఈనాడు ప్రపంచములో సగము మంది ఆయనను ఘనపరుస్తారు.

గలిలయ కొండల ప్రాంతములో నజరేతను చిన్నవూరిలో యేసు పెరిగెను. అయినను 30వ సంవత్సరము వచ్చువరకు ప్రసిద్ధి గాంచిన వానిగ జీవించలేదు. తదుపరి మూడున్నర సంవత్సరముల మట్టుకు ఆయన బహిరంగ సువార్త జీవితాన్ని జీవించారు. ఆ పరిచర్య వలన ప్రపంచ చరిత్రే మార్చబడింది.

ఆయన జ్ఞానోపదేశకుడు, సామాన్య ప్రజలు ఆయన మాటలను ఆసక్తితో వినేవారు (మార్కు 12:37). "ఆయన వారి శాస్త్రుల వలెగాక అధికారము గలవాని వలె వారికి బోధించెను" (మత్త 7:27).

యేసు తన్ను గూర్చి ఆశ్చర్యమైన, కలవరము రేపే సంగతులు చెప్పుకొనేవారు. ఆయన మానవుని కంటే ఉన్నతుడనని, బోధకుని కంటే ఘనుడనని, ప్రవక్త కంటే ఘనుడనని తన్ను గూర్చి చెప్పేవారు. ఆయన దేవుడనని, దేవుని కుమారుడననీ భావమిచ్చేటట్లు బోధించేవారు, అది ఆయన బోధ యొక్క ముఖ్యఉద్దేశ్యము.

**మనుష్యకుమారుడు, దేవుని కుమారుడు :**

యేసు యొక్క పరిచర్య ఆరంభదినాల్లో నీకోదేము అను ఒక మనుష్యుడు ఆయన యొద్దకు వచ్చాడు. నీకోదేము ఒక పరిసయ్యుడు యూదుల సమాజమందిరపు సభ్యుడు. అతడు యేసునొద్దకు రాత్రివేళ వచ్చి "బోధకుడా, నీవు దేవుని యొద్ద నుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము; దేవుడతనికి తోడైయుంటేనే గాని నీవు చేయుచున్న సూచక క్రియలు ఎవడును చేయలేడని ఆయనతో చెప్పెను" (యోహాను 3:1,2).

"అందుకు యేసు అతనితో ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (యోహాను 3:3). మరల యేసు అతనితో "ఒకడు నీటిమూలము గాను, ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (యోహాను 3:5).

క్రొత్త జన్మ ఒక నూతన జన్మయని వివరించిన తరువాత యేసు ఇట్లు చెప్పారు:

"మరియు పరలోకము నుండి దిగివచ్చినవాడే అనగా పరలోకములో ఉండు మనుష్యుడే తప్ప పరలోకమునకు ఎక్కిపోయిన వాడెవడును లేడు. అరణ్యములో మోషే సర్పమును ఏలాగు ఎత్తెనో, అలాగే విశ్వసించు ప్రతివాడును నశింపక ఆయన ద్వారా నిత్యజీవమును పొందునట్లు మనుష్యకుమారుడు ఎత్తబడవలెను. దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన

వాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను " (యోహాను 3:13-16). తదుపరి ఆయనే ఆ ఏకైక కుమారుడనని యేసు అతనికి బోధించెను (యోహాను 3:18).

నీకొదేము యేసును రబ్బీ అనగా బోధకుడా అని సంబోధించాడు, గాని యేసు అతనికి ఒక క్రొత్త మార్గములో బోధించారు. "ప్రభువు ఈలాగు సెలవిచ్చుచున్నాడు" అనిగాక "నిశ్చయముగా నేను నీతో చెప్పుచున్నాను" అని ఆయన బోధించారు. అధికారము కొరకు బోధకుల మాటలు చెప్పుట గాక, పాతనిబంధన లేఖనముల నధిగమించే దైవధికారము ఆయన కున్నట్లు ఆయన బోధించారు. అంటే, ఆయన దేవుని మాటలనే పలుకు చున్నట్లు చెప్పారు. అట్టి ఆరోపణ విప్లవాత్మకమే.

తనను గూర్చి తాను 'మనుష్య కుమారుడనని' చెప్పుకొన్నప్పుడు ఆయన పరిపూర్ణ మానవుడనని మాత్రమే గాక దానియేలు వర్ణించినట్లు ఆయన మెస్సీయ యని కూడ చెప్పుకొనెను. దానియేలుకు కలిగిన దర్శనమును అతడింకా చూడగా ఆకాశమేఘారూఢుడై మనుష్య కుమారుని పోలిన యొకడు వచ్చి ఆ మహావృద్ధుడగు వాని సన్నిధిని ప్రవేశించి, ఆయన సముఖమునకు తేబడెను. సకల జనులును రాష్ట్రములును ఆయాభాషలు మాటలాడువారును ఆయనను సేవించునట్లు ప్రభుత్వమును మహిమయు ఆధిపత్యమును ఆయన కీయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది. అదెన్నటికిని తొలిగిపోదు: ఆయన రాజ్యము ఎప్పటికిని లయముకాదు" (దానియేలు 7:13-14).

తాను మనుష్యకుమారుడనని చెప్పుకొనుటలో, యేసుతాను పరలోకము లోనుండి దిగివచ్చిన మెస్సీయనని తెలియజేసుకొనెను. మరియు తన నిత్య రాజ్యము నేలుటకు తండ్రి యొద్దకు తిరిగి వెళ్లుదునని చెప్పుకొనెను. తాను దేవుని ఏకైక అద్వితీయ కుమారుడనని వర్ణించు కొనుట వలన తాను దైవత్వములోని వ్యక్తినని చెప్పుకొనెను. దీని వలన యూదుల నాయకులు ఉద్రేక భరితులైరి.

**మతనాయకులతో యేసు సంబంధము :**

కొండమీద చేసిన ప్రసంగములో యేసుతరచు "అని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా గాని నేను చెప్పునదేమనగా" యని చెప్పేవారు (మత్త 5:21,27,31,33,38,43). గతంలోను ప్రస్తుతంలోను యూదుల బోధకులు చేయుచున్న సంప్రదాయ బద్ధమైన బోధలను ఆయన సవాలు చేసారు.

ఒక సందర్భములో ఆయన, "నోట పడునది మనుష్యుని అపవిత్ర పరచదుగాని నోటనుండి వచ్చునదియే

మనుష్యుని అపవిత్రపరచునని చెప్పెను" (మత్తయి 15:11). ఇక్కడ పవిత్ర , అపవిత్ర భోజ్యములను గూర్చి పాతనిబంధన బోధను ప్రక్కకు నెట్టేసారు. పాత నిబంధన బోధను తొలగించి దాని స్థానంలో తనస్వంత బోధను ప్రవేశపెట్టే యితడు ఎట్టివాడు? క్రొత్తనిబంధనను ప్రవేశపెట్టుచున్న ఈయన ఎవడు ?

**దేవుని వ్రేలితో :**

ఒకనాడు యేసు మూగదయ్యమును వెళ్లగొట్టగా ఆ దయ్యము వదిలిపోయిన తరువాత మూగవాడు మాటలాడెను. ప్రజలు ఆశ్చర్యపడిరి గాని వారిలో కొందరు "ఆయన దయ్యముల అధిపతియైన బయెల్జెబూలు వలన దయ్యములను వెళ్లగొట్టుచున్నాడని చెప్పుకొనిరి" (లూకా 11:14-15). ఒక అద్భుత కార్యము జరిగెనని వారు కాదనలేకపోయిరి గాని ఆ క్రియ సాతాను శక్తివలన సాధ్యమాయెనని ఆరోపించిరి.

"ఆయన వారి ఆలోచనల నెరిగి వారితో ఇట్లనెను - తనకు తానే వైరైపోయిన ప్రతిరాజ్యము పడిపోవును. తనకు తానే విరోధమైన ప్రతియిల్లు కూలిపోవును. సాతాను తనకు తానే వేరుపడిన యెడల వాని రాజ్యమేలాగు నిలుచును? నేను దేవుని వ్రేలితో దయ్యములను వెళ్లగొట్టుచున్న యెడల మీ కుమారులు ఎవని వలన వెళ్లగొట్టు చున్నారు? అందుచేత వారే మీకు తీర్పరులై యుందురు. అయితే నేను దేవుని వ్రేలితో దయ్యములను వెళ్లగొట్టుచున్న యెడల నిశ్చయముగా దేవుని రాజ్యము మీ యొద్దకు వచ్చియున్నది" (లూకా 11:16-20).

యేసు దేవుని వ్రేలిని వినియోగించు చున్నట్లు విదితమే. ఆయన దేవుని శక్తిని బట్టి పనిచేయుచున్నారు. సాతానుపై ఆయనకున్న శక్తిని బట్టి దేవుని రాజరికము (రాజ్యము) నకు అది ఆరంభ సూచన యని ఆయన చెప్పెను.

**తండ్రి కుమరుల అవగాహన :**

గలిలయ ప్రాంతములో పరిచర్య చేస్తు యేసు, "సమస్తమును నా తండ్రి చేత నా కప్పగింపబడియున్నది. తండ్రిగాక యెవడును కుమారుని ఎరుగడు; కుమారుడు గాకను, కుమారుడెవనికి ఆయనను బయలుపరచనుద్దేశించునో వాడుగాకను మరి ఎవడును తండ్రిని ఎరుగడు" అని చెప్పెను (మత్త 11:27).

యేసు యొక్క స్వీయ అవగాహనను గూర్చి యిది మనకేమి చెప్పుచున్నది? ఆయన తానే దేవుని ఏకైక కుమారుడనని భావించుచున్నట్లును, ఆయన మాత్రమే తండ్రియైన దేవుని మానవులకు బయలు పరచువాడైనట్లును తెలియజేయుచున్నది.

**అబ్బా, తండ్రీ :**

దేవునికి ప్రార్థించుచు యేసు

అరామిక్ భాషలో అబ్బా అనగా తండ్రీయని సంబోధిం చేవారు. యిది వారిద్దరి మధ్యయున్న సన్నిహిత సంబంధమును తెలియజేయు చున్నది. అది ప్రేమ పూర్వకముగా పిలిచే పదము.

క్రొత్త నిబంధన కాలములో యూదులు దేవుని నామమును ఎంత గౌరవించే వారంటే తమ పెదవులతో ఆయన నామమును అపవిత్ర పరచెదమేమో యనే భయంతో దానిని ఉచ్ఛరించే వారుకాదు. గాని యేసు దేవుని అబ్బా, తండ్రీయని ఉచ్ఛరించుటయే గాక, ఆయన శిష్యులకు కూడ దానిని నేర్పించారు. దేవునితో ఆయన సన్నిహిత సంబంధము కలిగియుండుటయే గాక, అట్టి సంబంధమును మనమును కలిగియుండునట్లు ఆయన సాధ్యపరచారు. ఆయన దేవుని ప్రేమపూర్వక కుమారుడని యేసు ఎరుగును. అందువలన ఆయన సన్నిహిత సంబంధ పదజాలములను వినియోగించి ప్రార్థించేవారు.

**దేవునితో సమానుడు :**

ఒక సబ్బాతు దినమందు యెరూష లేములో బెతెస్థ కోనేటి దగ్గర యేసు ఒకని స్వస్థపరచారు. అతడు 38 సంవత్సరముల నుండి వ్యాధిగ్రస్థుడై యుండెను. సబ్బాతు దినమందు స్వస్థపరచినందున యూదులు ఆయనను విమర్శింపగా, యేసు " నా తండ్రి యిది వరకు పనియుచున్నాడు; నేనును చేయుచున్నానని వారికుత్తరమిచ్చెను" (యోహాను 5:17).

ఈ మాట వినగానే యూదులు అత్యాగ్రహులై ఆయనను చంపజూచారు. ఆయన విశ్రాంతి దినాచారము మీరుటయేగాక, దేవుడుతన సొంత తండ్రియని చెప్పి తన్ను దేవునితో సమానునిగా చేసికొనినందున యూదులు ఆయనను చంపవలెనని మరిఎక్కువగా ప్రయత్నము చేసారు (యోహాను 5:18).

**"నీవు మనుష్యుడవే, దేవుడనని చెప్పుకొనుచున్నావు" :**

యెరూషలేములో ప్రతిష్ఠత పండుగనాడు "యూదులు ఆయన చుట్టుపోగై ఎంతకాలము మమ్మును సందేహపెట్టదువు? నీవు క్రీస్తు వైతే మాతో చెప్పుమనిరి" (యోహాను 10:24).

"అందుకు యేసు – మీతో చెప్పితిని గాని మీరు నమ్మరు. నేను నా తండ్రి నామమందు చేయుచున్నక్రియలు నన్నుగూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి. అయితే మీరు నా గొర్రెలలో చేరిన వారు కారు గనుక నన్ను నమ్మరు. నా గొర్రెలు నా స్వరము వినును. నేను వాటి నెరుగుదును. అవి నన్ను వెంబండించును. నేను వాటికి నిత్యజీవము నిచ్చుచున్నాను. గనుక అవి ఎన్నటికిని నశింపవు. ఎవడును వాటిని నాచేతిలో నుండి అపహరింపడు. వాటిని

నా కిచ్చిన తండ్రి అందరికంటె గొప్పవాడు గనుక నా తండ్రి చేతిలో నుండి యెవడును వాటిని అపహరింపలేడు. నేనును తండ్రియు ఏకమై యున్నామని వారితో చెప్పెను ” (యోహాను 10:25-30).

ఈ మాట వినగానే వారు ఆయనను కొట్టవలెనని రాళ్లు చేతపట్టుకొనగా “యేసు తండ్రియొద్ద నుండి అనేకమైన మంచి క్రియలను మీకు చూపితిని; వాటిలో ఏ క్రియ నిమిత్తము నన్ను రాళ్లతో కొట్టదురని వారినడిగెను”(యోహాను 10:32). “అందుకు యూదులు – నీవు మనుష్యుడవై యుండి దేవుడనని చెప్పుకొనుచున్నావు గనుక దేవదూషణ చేసినందుకే నిన్ను రాళ్లతో కొట్టుదుము” అని జవాబిచ్చిరి (యోహా 10:33). యేసు తండ్రియైన దేవునితో సమానునిగా చేసికొనుచున్నాడని వారు గ్రహించిరి.

**పాపములు క్షమించే అధికారము :**

కపెర్నహూములో యేసు ఒక యింటనున్నాడని వినవచ్చినప్పుడు అనేక జనులు కూడవచ్చిరి. గనుక వాకిటనైనను వారికి స్థలము లేకపోయెను. ఆయన వారికి వాక్యము బోధించుచుండగా పక్షవాయువు గల మనుష్యుని నలుగురిచే మోయించుకొని ఆయన యొద్దకు తీసికొని వచ్చిరి. చాలమంది కూడియున్నందున వారాయన యొద్దకు చేరలేక ఆయన యున్నచోటికి పైగా ఇంటిపై కప్పు విప్పి సందుచేసి పక్షవాయువు గల వానిని పరుపుతోనే దింపిరి. యేసువారి విశ్వాసము చూచి, కుమారుడా నీ పాపముల క్షమింపబడియున్నవి అని అతనితో చెప్పెను (మార్కు 2:1-5).

యేసువారి ఆలోచనల నెరిగి వారితో “ఈ పక్షవాయువు గలవానితో నీ పాపములు క్షమింపబడియున్నవని చెప్పుట సులభమా ? నీవులేచి నీ పరుపు నెత్తికొని నడువుమని చెప్పుట సులభమా? అయితే పాపములు క్షమించుటకు భూమిమీద మనుష్య కుమారునికి అధికారము కలదని మీరు తెలిసికొనవలెనని చెప్పి పక్షవాయుగల వాని చూచి నీవు లేచి నీ పరుపునెత్తికొని యింటికి పొమ్మని నీతో చెప్పుచున్నానెను. తక్షణమే వాడులేచి, పరుపెత్తుకొని వారందరి యెదుట నడిచిపోయెను. వారందరు విభ్రాంతినొంది మనమీలాటి కార్యములను ఎన్నడు చూడలేదని చెప్పుకొనుచు దేవుని మహిమ పరచిరి” (మార్కు 2:8-12).

**యూదుల మహాసభ యెదుట యేసుసాక్ష్యము :**

యూదుల మహాసభ యెదుట యేసుకు తీర్పు తీర్చబడుచుండగా ప్రధాన యాజకుడు ఆయనను చూచి, “నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే ఆ మాట మాతో చెప్పుమని జీవము గల దేవుని తోడని నీకు ఆనబెట్టుచున్నాననెను” (మత్తయి 26:63). “అందుకు యేసు – నీవన్నట్టే ఇది

మొదలుకొని మనుష్య కుమారుడు సర్వశక్తుని కుడిపార్శ్వమున కూర్చుండుటయు ఆకాశ మేఘరూఢుడై వచ్చుటయు మీరు చూతురని" చెప్పెను (మత్తయి 26:64).

ఈ మాటవిని ప్రధాన యాజకుడు తన వస్త్రములు చింపుకొని వీడు దేవదూషణ చేసెను; మనకిక సాక్షులతో ఏమిపని ? యని అరచెను (26:65). యేసు తాను దేవుని కుమారుడనని చెప్పగానే దాని అర్థాన్ని యూదుల నాయకులు గ్రహించారు. తాను దైవవ్యక్తినని, దేవుని తత్వములో, భాగస్థుడనని ఆయన చెప్పుకొనెను. ఆయన కుమారుడైన దేవుడు.

నేనే ఆయనను (I Am)

తాను దేవుడనని చెప్పుకొనుటలో యేసు "నేనే ఆయనను" అనే పేరును ఎక్కువ వినియోగించుకొన్నారు. దేవుడు మండుచున్న పొద ద్వారా మోషేకు కనబడి ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించే బాధ్యత అతనికి అప్పగించినప్పుడు మోషే దేవునితో "చిత్తగించుము; నేను ఇశ్రాయేలీయుల యొద్దకు వెళ్లి, మీ పితరుల దేవుడు నన్ను మీ యొద్దకు పంపెనని చెప్పగా వారు, ఆయన పేరేమి అని అడిగిన యెడల వారితో నేనేమి చెప్పవలెను?" అని అడిగెను. అందుకు దేవుడు నేను ఉన్నవాడను అనువాడనై యున్నాని మోషేతో చెప్పెను. మరియు ఆయన ఉండునను వాడు మీ యొద్దకు నన్ను పంపెనని ఇశ్రాయేలీ యులతో చెప్పుమనెను" (నిర్గమ 3:13- 15).

యావే అనునది హెబ్రీపదము. ఉన్నావాడని దాని యర్థము. దేవుడు నిత్యుడు, స్వయంజీవుడు, ఇప్పుడు ఎల్లప్పుడు తన ప్రజలతో యుండువాడని ఆయన పేరు యొక్క భావం. ఈ పేరును యేసు తనకు తానే యూదుల ఆలయములలోను, మహాసభలోను వర్తింపజేసుకొనెను. ఆయన యూదులతో, "నేను ఆయనని మీరు విశ్వసించని యెడల మీ పాపములోనే యుండి చనిపోవుదురని చెప్పెను" (యోహాను 8:24). "మీరు మనుష్యకుమారుని (సిలువ) పైకెత్తినప్పుడు నేనే ఆయనని గ్రహింతురు" (యోహాను 8:28).

ఆయన యూదులతో "మీ తండ్రియైన అబ్రాహాము నా దినము చూతునని మిగుల ఆనందించెను, అది చూచి సంతోషించెననెను" (యోహాను 8:56).

"అందుకు యూదులు నీకింకను ఏబది సంవత్సరములైనను లేవే, నీవు అబ్రాహామును చూచితివా అని ఆయనతో అనగా, యేసు అబ్రాహాము పుట్టక మునుపేనేనున్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను'' (యోహాను 8:57-58). కాబట్టి వారాయన మీద

రువ్వుటకు రాళ్లు ఎత్తిరి గాని యేసు దాగి దేవాలయములో నుండి బయటికి వెళ్లిపోయెను.

**యేసు తన ఆరోపణలను బలపరచెను :**

యేసు తన్ను గూర్చి చెప్పుకొనిన మాటలు మీదనే గాక, ఆ మాటలను ఆయన ఎట్లు బలపరచారో దానిపై మన స్పందన ఆధారపడియుండును. ఆయన తన్నుగూర్చి చెప్పుకొన్నవి ఎవరైనా చెప్పుకోవచ్చును గాని ఆ మాటలు వారు బలపరచగలగాలి.

"యేసు జీవహారము నేనే, నా యొద్దకు వచ్చువాడు ఏ మాత్రమును ఆకలిగొనడు. నాయందు విశ్వాసముంచు వాడు ఎప్పుడును దప్పిగొనడని " చెప్పెను (యోహాను 6:35). ఆయన ఐదు రొట్టెలు రెండు చిన్న చేపలతో 5000 మందికి ఆహారము పెట్టిన తరువాత పైమాటలు చెప్పెను. (యోహాను 6:35; 6:1-13).

"నేను లోకమునకు వెలుగును" అని యేసు చెప్పారు (యోహా 8:12). రాత్రి వచ్చుచున్నది, అప్పుడెవడును పనిచేయ లేడు. నేను లోకములో ఉన్నప్పుడు లోకమునకు వెలుగునని యేసు చెప్పెను (యోహా 9:4-5). అట్లు చెప్పి ఆయన ఒక గ్రుడ్డివానికి చూపునను గ్రహించెను (9:6-8).

"యేసు పునరుత్థానమును జీవమును నేనే, నా యందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును, బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు అని చెప్పెను (యోహాను 11:25-26). ఆయన అట్లు చెప్పి చనిపోయిన లాజరు సమాధి దగ్గరకు వచ్చి, "లాజరూ బయటికి రమ్మని బిగ్గరగా చెప్పగా, చనిపోయినవాడు ప్రేత వస్త్రములతో కట్టబడిన వాడై బయటికి వచ్చెను (యోహాను 11:43-44). లాజరు చనిపోయి అప్పటికి నాలుగు దినములనుండి సమాధిలో యుండెను. యేసు నిజముగా జీవమును, పునరుత్థానమునై యున్నానని నిరూపించెను.

"నేను గొర్రెలకు మంచికాపరిని, మంచి కాపరి గొర్రెల కొరకు తన ప్రాణము పెట్టును" అని యేసు చెప్పెను (యోహాను 10:11; 17-18). ఆయన ఈ మాటలు చెప్పిన అనతికాలములోనే ఆయన సిలువపై ఇష్టపూర్వకముగా మనకొరకు తన ప్రాణమర్పించెను.

**సంగ్రహము :**

తన గుర్తింపు కొరకు యేసు ఎన్నడు ఆందోళన జెందలేదు, తాను దేవుని ఏకైక కుమారుడని ఆయన ఎరుగును. మానవులను పాపము నుండి విడుదల చేయు నిమిత్తము దేవుడాయనను పంపెనని ఆయన ఎరిగియుండెను (యోహాను 8:31-32,

34,36).

దేవుడాయనలో యుండి పనిచేయు చుండెనని, ఆయన ద్వారా మాట లాడుచుం డెనని, ఆయనను నడిపించు చుండెనని యేసు ఎరుగును. యేసు మాట్లాడినప్పుడు దేవుని మాటలనే పలికెను. ఆయన పనిచేసినప్పుడు, దేవుడే ఆపని చేసెను.

**ముగింపు :**

"ఆది యందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెనని" అందుకే యోహాను తన సువార్త గ్రంధము నారంభించెను (యోహాను 1:1-2). "ఆ వాక్యము శరీరధారియై కృపా సత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను. తండ్రి వలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి" (యోహాను 1:14).

"ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు; తండ్రి రొమ్ముననున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను" (యోహాను 1:18).

యేసును గూర్చి నీయభిప్రాయమేమిటి? ఆయన ఎవరి కుమారుడు? (మత్త 22:42).

-రిచర్డ్ ఏడీ

**గమనిక::**

**సత్యవాణి T.V. కార్యక్రమములను ప్రతి బుధ, వారము సాయంత్రం 6:30 గంటలకు రక్షణ ఛానల్ లోను, శనివారం ఉదయం 8 గంటలకు ఆరాధన ఛానల్ లోను, సాయంత్రము 7 గంటలకు UCC. ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం 6:00 గంటలకు శుభవార్త ఛానల్‌లోను చూడండి.**

**మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా ఇప్పుడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక కొనసాగించుకోనండి. క్రొత్తవారిని చేర్పించండి.**

**- ఎడిటర్**

# యేసును చూడ గోరెను గాని,.........!

ఒకనొక దినమున యెరికో పట్టణములో సుంకపుగుత్త దారుడు (Chief Tax Collecton, ధనవంతుడును, అచటి జనులందరి దృష్టిలో పాపియైన మనుష్యుడగు జక్కయ్య అనునతడు సదరు నగర సంచారమున గల యేసును ఎవరోయని చూడగోరెను. ఆయన రాకతో చుట్టు జనులు చేరి గుంపులుగ గుమికూడి యున్నందున భౌతికముగ పొట్టివాడైన జక్కయ్య యేసును చూడగోరి ఆసక్తితో పరుగులు తీసి చెంతనున్న మేడి చెట్టెక్కెను.

యేసు ఆశ్చర్యకరుడని, ఆలోచన కర్తయని, సమాధానాధిపతియనియు ప్రవక్తయైన యెషయా (9:6) ముందుగా వ్రాసిన వివరణ జక్కయ్యకు తెలిసి యున్నదా? ఆయనే రక్షకుడని (మత్తయి 1:21, లూకా 2:11) తన పాపముల నుండి రక్షించునని తెలియునా ? దేవుడు మనకు తోడు అను అర్థమిచ్చు ఇమ్మానుయేలను (మత్తయి 1:23) పేరుగలవాడు, అభిషక్తుడును క్రీస్తు (2:11) లేదా రాబోవు మెస్సీయ (యోహాను 4:25,26). ఆయనే యని గుర్తించినాడా ? పెండ్లి కుమారుడు (మత్తయి 9:15) మనుష్య కుమారుడు (8:20). అని యేసుకు మారుపేర్లు గలవని వినియుండెనా? లేక జీవాహారము (యోహాను 6:51),వెలుగు (8:12), పరలోక మార్గము, సత్యము, జీవము (14:6). ఆయనేయని ఆయన తెలుపుట గమనించి నాడా? దేవుని గొర్రెపిల్ల (1:29) అని కూడా పిలువబడినట్లు గమనించి నాడా? యేసే ప్రభువని (అపో.కా. 8:16 ఎఫెసీ 5:20) కడపటి ఆదామని (1కొరింథీ 15:45) సర్వాధిపతి (పాలించే రాజు) (1 తిమోతి 6:15) యని, రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువని (6:15) శ్రీమంతుడని 6:15) యని, దేవునికి నరులకును మధ్యవర్తి (2:5) అని వినియు న్నాడా? బహుశా: ఆయన దావీదు సంతాన మని (2 తిమోతి 2:8) ఎరిగి యుండ వచ్చును. ఆయున ప్రధాన యాజకుడయినా (హెబ్రీ 6:20) సజీవమైన రాయిగా చెప్పబడినా (1 పేతురు 2:4). ప్రధాన కావరియైన (5:4) లేదా అమూల్యమైన మూలరాయిగా పేర్కొనబడినా (2:6,7) ఆవిషయం ఒక్కయ్యకు తెలియకపోవచ్చును యేసు దేవుని కుమారునిగా (1 యోహాను 5:13). అంగీకరించబడినట్లు (మత్తయి 16:16). లేక యూదాగోత్రపు సింహమని (ప్రకటన 5:5) తెలియబడక పోవచ్చును. దేవుని వాక్యమే యేసునామమని (19:13) నేటికీ కొందరికి తెలియకున్నట్లు నాడు జక్కయ్యకు

కూడా తెలియబడక పోవచ్చును.

యేసు ఆ చోటికి వచ్చినప్పుడు మేడి చెట్టెక్కిన జక్కయ్యను కనుగొని యాతని చెట్టు దించి, యింట సంతోషముతో చేర్చుకొనబడి వానితో బసచేసెను. ఫలితముగా జక్కయ్య తన ఆస్తిలో సగము పేదలకును, అన్యాయముగా సంపాదించిన దానితో ఒకటికి నాలుగంతలు చొప్పున తిరిగి ఎవనిది వానికి చెల్లించుటకు నిర్ణయించెను. అతనిలో వచ్చిన మార్పుకు ప్రతిగా యేసు జక్కయ్య యింటికి రక్షణననుగ్రహించి, అతనిని కూడ అబ్రహాము కుమారునిగా ప్రకటించుటయే గాక, తాను పరమునుండి ఇలకు దిగివచ్చిన కారణమును "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెనని" అతనికి వ్యక్తపరచెను (లూకా 19:10).

-ఎస్.ఆర్.తిరుగుళ్ళ

## పరమందొకదేవుడున్నాడు
## (There is a God in Heaven)

బబులోను రాజైన నెబుకద్నెజరు ఎదుటనిలబడి ప్రవక్తయైన దానియేలు పరమందొక దేవుడున్నాడని చెప్పెను (దాని 2:28). తాను చెప్పినది సత్యమని నిరూపించుట కొరకు రాజు మరచిపోయిన కలను దాని భావమును కూడా దానియేలు అతనికి తెలియజెప్పెను .రాజు దానియేలును బబులోను సంస్థానమంతటి మీద అధిపతిని గాను బబులోను జ్ఞానులందరిలో ప్రధానునిగాను నియమించెను (దాని 2:48). ఇంతగొప్ప సత్యమును తెలిసికొనినందున రాజు బహుగా సంతోషించెను. దేవుడెట్లుంటాడో, ఆయన యేమి చేయగలరో తెలిసికొనిన తరువాత అతడు దేవుని యందు విశ్వాసముంచెను.

రుజువులు సత్యాన్ని కనుగొనవు గాని స్థిరపచును.

ఈ వ్యాసం దానియేలు చెప్పిన "పరమందొక దేవుడున్నాడను" మాటను సిద్ధరపరచును. యిది మంచి మాట గనుక దేవుని ఉనికిని గూర్చిన రుజువులను ఇక్కడ యిచ్చుటకు మనం ఆరంభించము. అయితే మనం సంగ్రహించుకోలేని దేవుని గూర్చి రుజువు లెట్లు సమర్పించగలము? రుజువులు అవుసరం నిజమే.
అయితే అవి ముందుకాదుగాని చివర్లో సమర్పించబడును. అవిసత్యాన్ని కనుగొనవు గాని స్థిరపరచును. గనుక

ముందు దేవుని తత్వాన్ని తెలిసికొనుటకు ప్రయత్నించుదాం.

**దేవుని తత్వాన్ని గూర్చిన పఠనము విశ్వాసానికి ఆరంభము :**

దేవుని గూర్చి వివిధ భావాలున్నాయి. దేవుడు మానవునివంటి వాడేగాని, గంభీరుడని కొందరు భావిస్తారు. కొందరు ఆయన వ్యక్తిత్వాన్ని తొలగించి, ఆయన ప్రత్యేకంగా ఒక చోటకాదుగాని అన్నిచోట్ల యుంటాడని తలస్తారు. ప్రకృతి , దేవుడు ఒక్కటే యని మరికొందరంటారు. ఆయన ఉనికిని గూర్చిన రుజువులను సమర్పించక ముందు దేవుని తత్వాన్ని తెలిసికొనుట ముఖ్యమని మనం గ్రహించుకోగలం "నేను యెహోవాను, మరి ఏ దేవుడును లేడు, నేను తప్ప ఏ దేవుడును లేడని" ఆయన చెప్పినందున ఆయన తత్వాన్ని గూర్చి తెలిసికొనుట నిజమైన విశ్వాసమునకు నాంది యగును. "నేనుమొదటివాడను, కడపటివాడను, నేను తప్ప ఏ దేవుడును లేడు" (యెషయా 45:5; 44:6). నేను తప్ప వేరొక దేవుడున్నాడా? " (యెష 44:8) యని ఆయన పలికెను.

**రహస్యములు దేవునికి చెందును**

దేవుని నిజతత్వాన్ని గూర్చిన అన్వేషణ అశేషమైన ప్రయత్నాలకు దారితీయునని కొందరు తలస్తారు. యిది కొంత మట్టుకు నిజమే. దేవునికి తెలిసినదంతా మానవునికి తెలియదు. అట్లయితే అతడు కూడ దేవుని యంత జ్ఞానియే యగును. మానవుడు మితము చేయబడినవాడు. దేవుడు అపరిమితుడు. "సర్వశక్తుడగు దేవుడు మహాత్మ్యము గలవాడు. ఆయన మనకు అగోచరుడు"(యోబు 37:22,23). దేవుడుతనను గూర్చియు, తన పనులను గూర్చియు కొన్ని సంగతులు మానవునికి బయలు పరచలేదు. దేవుని ప్రక్తయైన మోషే ఇట్లు చెప్పాడు: "రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును. అయితే బయలు పరచబడినవి మనవియు మన సంతతివారివి యునగును " (ద్వితీ 29:29).

యోబు గ్రంధము 38,39 అధ్యాయాలలో దేవుడు తన రహస్యములలో కొన్నిటిని గూర్చి యోబును ప్రశ్నించారు. అవినేటి వరకు మానవునికి అర్ధము కాని రహస్యములే. యోబును దేవుడిట్లు ప్రశ్నించారు: "సముద్రపు ఊటల లోనికి నీవు చొచ్చితివా? వడగండ్ల నిధులను నీవు చూచితివా? వర్షమునకు తండ్రి యున్నాడా ? మంచు బిందువులను పుట్టించు వాడెవడు? మంచు గడ్డయెవని గర్భములోనుండి వచ్చును? ఆకాశమండలపు కట్టడలను నీవెరుగు దువా? దానికి భూమి మీద గల ప్రభుత్వము ను నీవు స్థాపించగలవా?" (యోబు38:16, 17,19,22,28,29,33).

మానవునికి దేవుడు తన్నుతాను

బయటుపరచుకొన్నారు.

రహస్యములు దేవునికి చెందునని చెప్పిన లేఖనముమే, బయలు పరచబడినవి మనవి యగునని చెప్పుచున్నది. దేవుడు మానవునికి అనేక విధములుగా తన్నుతాను బయలు పరచుకొన్నారు. దేవుని గూర్చి మానవుడు తెలిసికోగల సంగతులు అనేకములున్నాయి. దేవుని యొక్క తత్వము, ఆయన యొక్కనడవడి సంళువుగా గ్రహించుకోగలము ఏలయనగా అవి ఆయన వాక్యమునందును, యేసుక్రీస్తునందును మనకు విపులముగా బయలు పరచబడినవి. అపో.పౌలు ఇట్లు చెప్పాడు: "నిరాక్షేపముగా దైవ భక్తిని గూర్చిన మర్మము గొప్పదై యున్నది. ఆయన సశరీరుడుగా ప్రత్యక్షమయ్యెను, ఆత్మవిషయమున నీతిపరుడని తీర్పునొందెను, దేవదూతలకు కనబడెను, రక్షకుడని జనములలో ప్రకటింపబడెను, లోకమందు నమ్మబడెను. ఆరోహణుడైతేజోమయుడయ్యెను " (1 తిమో 3:16). అపో.పౌలు చెప్పినట్లు దేవుడు క్రీస్తు నందుండి లోకమును తనతో సమాధాన పరచుకొనుచుండెను (2 కొరింథీ 5:19). తనను చూచినవాడు తండ్రిని చూచి యున్నాడని క్రీస్తు చెప్పెను (యోహాను 14:9). అందువలన క్రైస్తవులు సమస్త పరిశుద్ధులతోకూడ దేవుని ప్రేమయొక్క పొడవు, వెడల్పు, లోతు, ఎత్తు ఎంతో గ్రహించుకొనుటకు తగిన శక్తి గలవారు కాగల్గుదురు (ఎఫెసీ 3::18,19). దేవుని యొక్క తత్వము,నడవడి విపులముగా బయలుపరచబడినందున దానిని పఠించుట కారంభించెదము.

(సశేషం)

## ఒక ఆత్మ యొక్క విలువ
## (The Value of a Soul)

ఆత్మకంటే శరీరమునకు విలువనిచ్చే కాలములో మనము నివసించుచున్నాము. శస్త్ర చికిత్సలు, గుండె మార్పిడులు, అవయవమార్పిడులు చేసేయుగం యిది. ప్రతి సంగతి శరీర సుఖము కొరకు మల్చబడిన యుగం యిది. శరీరాన్ని గూర్చి యిచ్చుచున్న ప్రాముఖ్యతను బట్టి మానవుడు తన ఆత్మను నిర్లక్ష్యముచేయుచున్నాడు. తన ఆత్మయొక్క విలువను గ్రహిచుకోకుండా అపవాది మానవుని గ్రుడ్డివానిగా చేసేసింది. "దేవుని స్వరూపియైన క్రీస్తు మహిమను కనుపరచుసువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము ఈయుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగ జేసెను'' అని 2 కొరింథీ 4:4

చెప్పుచున్నది . సువార్త ద్వారా ఒక ఆత్మ యొక్క విలువను మానవుడు కనుగొనకుండ అపవాది చేయ గలిగినదంతా చేయు చున్నాడు.

ఆత్మను దేవుడు దయచేసారు గనుక అది విలువైనది. "దేవుడు తన స్వరూప మందు నరుని సృజించెను; స్త్రీ నిగాను పురుషునిగాను వారిని సృజించెను " అని ఆదికాండము 1:27 చెప్పుచున్నది. మానవుడు దేవుని స్వరూప మందు చేయబడినందున అతడు మిగతా సృష్టి అంతటి నుండి వేరైనవాడు. ఏదైనా ఒక మంచి శిల్పి చెక్కిన విగ్రహమును తెచ్చుకొనుటకు ప్రజలు విపరీతమైన ధనాన్ని వెచ్చిస్తారు. గాని తమ ఆత్మను సృష్టికర్తయైన దేవుడే సృజించి యిచ్చాడని వారు గ్రహింపరు. ఆయన ఈ విశ్వాన్నం తటినీ చెక్కిన నిత్యశిల్పి.

రెండవదిగా బైబిలు శరీరము కంటే ఆత్మకే ఎక్కువ విలువ నిచ్చుచున్నది. మత్తయి 10:28లో యేసు ఇట్లు చెప్పారు. "మరియు ఆత్మను చంప నేరక దేహమునే చంపువారికి భయపడకుడిగాని ఆత్మను దేహమును కూడ నరకములో నశింపజేయ గలవానికి మిక్కిలి భయపడుడి".

"శరీర సంబంధమైన సాధకము కొంచెము మట్టుకే ప్రయోజన కరమవును గాని దైవ భక్తి ఇప్పటి జీవ విషయము లోను రాబోవు జీవము విషయములోను వాగ్దానముతో కూడినదైనందున అది అన్ని విషయములలోను ప్రయోజనకరమవును" అని అపొ.పౌలు 1తిమోతి 4:8లో చెప్పాడు.

మూడవదిగా, ఈ లోకమంతటికంటే మానవుని ఆత్మ విలువైనదని ప్రభువు చెప్పుచున్నారు. "ఒక మనుష్యుడులోక మంతయు సంపాదించుకొని తన ఆత్మను (ప్రాణమును ) పోగొట్టుకొంటే అతనికేమి ప్రయోజనము? ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా యేమి ఇయ్యగలడు?" అని ఆయన అడిగారు (మత్త 16:26). ఈ లోకమంతటినీ నీవు సంపాందించు కొనినను నీకు సంతృప్తి కలుగదు. తనకు కావలసిన ఈ లోక సంగతులన్నిటినీ సొలోమోను అనుభవించాడు. గాని చివరకు "దేవుని యందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించినడుచు చుండవలెను. మానవ కోటికి ఇదియే విధి". యని అతడు చెప్పుచున్నాడు (ప్రసంగి 12:13).

నాల్గవదిగా, యేసు ప్రభువు నీ ఆత్మకొరకు చనిపోయారు గనుక నీ ఆత్మ యొక్క విలువఎంత గొప్పదో గ్రహించు కోవచ్చును. మానవుడు ఒక రక్షకునిగూర్చి మొర్రపెట్టే వరకు దేవుడు కనిపెట్టలేదు. దేవుడు మొదటి అడుగువేసి నశించుచున్న మానవుని వెదుక వచ్చారు. పాపపు కూపము నుండి మానవుని రక్షించడానికి యేసువచ్చారు. పరమందున్న నిత్య తండ్రిని

విడిచి యేసు ఈలోకమునకు వచ్చినప్పుడు ఆయన కెట్లుండెనో ఎన్నడైనా ఆలోచించావా? "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెను" అని యేసు చెప్పారు (లూకా 19:10). ప్రతి ఒక్కని ఆత్మ ప్రాముఖ్యమని యేసు చూపించారు. చివరిగా మన ఆత్మలను మనం దేవునికి అప్పగించుకొనాలని హెచ్చరింపబడి యున్నాము. ఉపదేశము ద్వారాను, మాదిరిని బట్టియు మనము హెచ్చరింపబడుచున్నాము. యేసు ప్రభువు "న్యాయముగా తీర్పుతీర్చు దేవునికి తన్నుతాను అప్పగించుకొనెను" అని 1పేతురు 2:23లో వ్రాయబడియున్నది. సిలువపై వ్రేలాడుచు యేసు, "తండ్రీ నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాననెను" (లూకా23:46). "కాబట్టి దేవునిచిత్తప్రకారము బాధపడు వారు సత్ప్రవర్తన గలవారై నమ్మకమైన సృష్టికర్తకు తమ ఆత్మలను అప్పగించుకొనవలెను" అని పేతురు హెచ్చరించుచున్నాడు (1పేతురు 4:19).

సొలొమోను చెప్పిన మాటలను మరచిపోరాదు. "మన్నైయునది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మదానిదయచేసిన దేవుని యొద్దకు మరల పోవును" (ప్రసంగి 12:7). నీ యాత్మ చివరకు దేవుని యొద్దకే పోవును గనుక నీ ఆత్మకు దేవుడొక నివాసము సిద్ధముచేయుచున్నారు గనుకను, నశించిన వారి ఆత్మలను అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచిన నిత్యాగ్నిలో పడవేయును గనుకను నీ ఆత్మయొక్క విలువ ఎట్టిదో గ్రహించుకొనవలెను, రక్షింపబడి దేవునితో నిత్యము గడుపునట్లు ఇప్పుడే నీ యాత్మను సిద్ధపరచుకోవలెను.

- జాన్ స్టేసీ

## మరణకరమైన పాపమనగానేమి ?
## (What is Sin unto Death?)

" తన సహోదరుడు మరణకరము కాని పాపము చేయగా ఎవడైనను చూచిన యెడల అతడు వేడుకొనును; అతని బట్టి దేవుడు మరణ కరముకాని పాపముచేసిన వానికి జీవము దయచేయును. మరణకరమైన పాపము కలదు. అట్టిదాని గూర్చి వేడు కొనవలెనని నేను చెప్పుటలేదు. సకల దుర్నీతియు పాపము; అయితే మరణకరము కాని పాపము కలదు" (1 యోహాను 5:16-17). మరణకమైన పాపము చేయువాడు, తాను చేయుచున్నది తప్పు అని ఎరిగియుండియు, ఆపాపములోనే నిలిచియుండును.

లేఖనములు ఇట్లుచెప్పుచున్నవి: "లోబడుటకు దేనికి మిమ్మును మీరుదాసులుగా అప్పగించుకొందురో,

అది చావు నిమిత్తముగా పాపమునకే గాని, నీతి నిమిత్తముగా విధేయతకే గాని దేనికి మీరు లోబడుదురో దానికే దాసుల గుదురని మీరెరుగరా ?" (రోమా 6:16). దేవుని కృపను, దేవుని నీతిని సంపాదించుకొనుటకు మనమెట్లు విధేయత చూపుదుమో, అట్లే పాపములో జీవించుటకు నిశ్చయించుకొని దానిలోనే కొనసాగితే మరణము ప్రతిఫలమగును. ప్రభువు యొుక్క వాగ్దానమును గమనించుము: "మరణ పర్యంతము నమ్మకముగా యుండుము, నేను నీకు జీవకిరీటమిచ్చెదను" (ప్రకటన 2:10). మరణ పర్యంతము అనగా మరణము సంభవించునంతమట్టుకు అని అర్ధము. ఒకవేళ మనకు మరణ సంభవించినను నమ్మకముగా యుంటే , జీవకిరీటము మనదగును. యేమి సంభవించినను కొందరు విశ్వాసములో ఎట్లు నమ్మకముగా యుందురో, అట్లే కొందరు యేమి సంభవించినను పాపములో కొనసాగుదురు. అట్టిది మరణకరమైన పాపము.

అయితే మారుమనస్సు నొందుటకు నిరాకరించు వానికొరకు ప్రార్థించుట వ్యర్థము. దీనిని యేసు ప్రభువు చక్కగా విశదీకరించారు : "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు" (లూకా 13:3). క్రీస్తునందున్న సహోదరుడు పాపజీవితములోనికి తిరిగి వెళ్లిపోయిన యెడల అతడు మారుమనస్సు పొంది ప్రభువు కోరుచున్నట్లు జీవించు లాగున మనం ప్రార్థన చేయవచ్చును. దేవుడతని క్షమించునట్లు మనం ప్రార్థించవచ్చును.

యేసు యొుక్క జననమును గూర్చి తెలియజేస్తు దేవుని దూత మరియతో "తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అనుపేరు పెట్టుదువనెను" (మత్తయి 1:21). దీనిని గమనించుము. ప్రజలను తమ పాపములలోనే రక్షించుటకు దేవుడు తన కుమారుని ఈ లోకమునకు పంపలేదు. ఆయన వారిని తమ పాపములనుండి రక్షించుటకు పంపారు. అయితే ఒకడు పాపములో జీవించుచు మారు మనస్సు పొందడానికి నిరాకంచుచున్న యెడల మనం ఎంత ప్రార్థించినా, విన్నవించినా అంతా వ్యర్థ వే. అట్టివాడు మరణకరమైన పాపములో జీవించుచున్నాడు.

## అత్యంత గొప్ప పురుషుడు
## (The Greatest Man)

ఆయనకు భూసంబంధ సేవకులెవరు లేరు, అయినను

ఆయనను వారు యజమానుడన్నారు.

ఆయనకు విశ్వవిద్యాలయ డిగ్రీ లేమీ లేవు

అయినను వారు ఆయనను గొప్ప బోధకుడన్నారు.

ఆయన యొద్ద ఔషధములేమీ లేదు అయినను ఆయన అనేకులను స్వస్థపరచారు.

ఆయన యొద్ద సైన్యమేమీ లేదు. అయినను

భూరాజులు ఆయనకు భయపడ్డారు.

ఆయన సైనిక బలముతో యుద్ధములేమీ చేయలేదు, అయినను ఆయన ఈ లోకాన్ని జయించారు.

ఆయన ఏ నేరమూ చేయలేదు,

అయినను వారాయనను సిలువ వేసారు.

ఆయనను సమాధిలో పాతి పెట్టారు, అయినను ఆయన సజీవుడై తిరిగిలేచారు.

"ఆయన ఆశ్చర్యకరుడైన క్రీస్తు" యెషయా 9:6.

చిల్డ్రన్ హోమ్‌లోని వసతిగృహ సముదాయమును స్థానికి ఎమ్.ఎల్.ఎ. ద్వారంపూడి చంద్రశేఖర్ గారి దరపున శ్రీ వీరభద్రారెడ్డి గారు, సత్యనారాయణ (టిక్కు) గార్లు రిబ్బన్లు కత్తిరించి సమాజసేవార్థమై ప్రతిష్ఠించిరి. జిమ్ కెల్లీ గారి ప్రార్ధనతో ఆసముదాయము తెరువబడెను. సత్యవాణి బిల్డింగ్ పై నిర్మించబడిన బాలబాలికల వసతి సదుపాయములను చూచి జిమ్ కెల్లీ గారు ఆనందభరితులైరి. ఆ సదుపాయమును నిర్మించుటలో తనవంతు భాగమును గూర్చి సంతోషించిరి. లెక్చరర్‌షిప్‌లో మొదటిరోజు మొదటి కూటమునకు వెయ్యిమందికి పైగా హాజరైరి. తగినంత సదుపాయము లేక సత్యవాణి బిల్డింగ్ ఆవరణ అంతా జనమయమాయెను. హాజరైన వారందరికి మూడుపూటలు చక్కటి, రుచి శుచి గల భోజనపానములు ఉచితముగానే అందించబడెను. ఆఖరి రాత్రి అందరికి మంచి విందు చేయబడెను. లెక్చర్ షిప్‌ను విజయవంతము చేసినవారందరికీ రిక్కీగూటం గారు తమ అభినందనములు తెలియజేసిరి. సోదరులు ఎలిపే ప్రభాకర్ రావ్ గారి ప్రార్థనతో లెక్చర్‌షిప్ విజయవంతముగా ముగిసెను.

## 2011 క్రొత్త సంవత్సర కేలండర్లు

క్రొత్త సంవత్సర కేలండర్లు ఇప్పుడు మావద్ద లభించుచున్నవి. ఆకర్షణీయమైన రంగులలో, ఖరీదైన ఆర్ట్ పేపరు పై ముద్రించబడియున్నది.

ఒక్కోపేజీకి ఒక్కో నెల మాత్రమే. ప్రతి పేజీలోను దేవుని గ్రంధములో నుండి ఒక లేఖన భాగం!

కేలండర్ ఒక్కొక్కటి 15/- రూ॥లు మాత్రమే 10 కేలండర్లకు 120/- రూ॥లు . పోస్టేజీ అదనం.

మీ కుటుంబానికి, మిత్రులకు, స్థానిక సంఘాలకు ఉపయోగపడును. ఇప్పుడే మీ ఆర్డరు పంపండి.


**Satya Vani**

7-9-35, సాంబమూర్తి వీధి

కాకినాడ - 533 004

ఫోన్ : 0884 - 2363722

# మీ కొక గొప్ప సదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును. గాని మీరు 85/- రూ॥లు మాత్రమే. మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిలు విద్యార్థులకు,బోధకులకు,తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.

***Satya Vani***

# 7-9-35, Sambamurty Street,
Kakinada- 533 004. Ph: 0884 - 2363722

**RNI Regd. No. 6997/98**
**Postal Regd. No. AP/KD-02/2009-2011**

**To**

From:

SATYA VAKKU
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004